# పార్వతమ్మ

(ఇది, నేను మొట్టమొదట రాసిన కథ)

"అమ్మా, కుసుమా! కుసుమా!"

"......................................"

"పార్వతీ" అన్న పిలుపు విని,

"ఆఁ వస్తున్నా నండీ!" అంటూ సావిట్లో కొచ్చింది పార్వతమ్మ.

"అమ్మాయేదే? ఎంత పిల్చినా పల్కదేమీ? దాని పేర కవరొచ్చింది."

"మేడపైనుంది. విన్పించలేదేమో! నేనూ పైకెడు తున్నాను. ఆ కవరిట్లా ఇవ్వండి, నేనిస్తాను."

జగన్నాథం గారు కవరందించారు. పార్వతమ్మ దాన్నందుకొని పైకెళ్ళింది. కుసుమకు అందించింది.

విలాసం తన పేరే వుంది. కవరుచించింది కుసుమ. లోపల కాగితం పచ్చగా కన్పించింది. ఒకటి శుభలేఖ, ఇంకోటి తనని మరీ మరీ రమ్మని వ్రాసిన స్నేహితురాలి స్వాగత లేఖ. రెండూ సొంతంగా చదివింది కుసుమ. శుభలేఖలో వధూవరుల ఫోటోలు కూడా వున్నాయి. తన స్నేహితురాలు మురళి పెళ్ళా? చదువెందుకు మానేసిందీ? వరుని పేరు — మురారీ రావు. బాగానే వుంది. తను తప్పకుండా వెళ్ళాలి. ఈ శుభవార్త తల్లితో చెబుదామని తలెత్తింది. పార్వతమ్మ అక్కడుంటేగా? ఎప్పుడెళ్ళి పోయిందో క్రిందికి.

కుసుమ గబగబా క్రిందకెళ్ళింది. "నాన్నారూ! మురళి పెళ్ళిటండీ! వరుడు యం.ఎస్.సీ. మనందర్నీ మరీ మరీ రమ్మని వ్రాసింది" అంటూ కవరందించింది తండ్రికి.

"ఏమిటి? మురళి పెళ్ళా? ఏం కంగారో! నీ కంటే చిన్నదానిలా కన్పడుతుంది. అప్పుడే చదువు మాన్పించి పెళ్ళి చేయవలసిన అగత్యమేమొచ్చిందీ?" అంటూ తన ఉద్దేశ్యాన్ని తెల్పింది పార్వతమ్మ.

"ఆ గొడవకేంగాని, మనందర్నీ రమ్మని వ్రాసిందిగా మరి? వెడదామా?" అని అడిగింది కుసుమ.

"అట్లాగేలే. ఏమంత భాగ్యం... బెజవాడెంత సేపెళ్ళి రావాలీ?" అంటూ కూతుర్ని సంతోషపెట్టారు జగన్నాథం గారు.

★ ★ ★

అప్పుడే మురళి పెళ్ళయి పది రోజులయింది. చుట్టాలంతా ఎటు వాళ్ళటు సర్దుకున్నారు.

ఆ రోజున జగన్నాథం గారూ, కుసుమా ఒక్కసారే భోజనాలకు కూర్చున్నారు. పార్వతమ్మ వడ్డిస్తోంది.

"పెళ్ళి బాగానే జరిగింది కదమ్మా?" అడిగింది పార్వతమ్మ.

"మంచి సంబంధం కుదరాలేకాని, పెళ్ళి చెయ్యటం అంత బ్రహ్మాండంగాదు" అన్నారు జగన్నాథం గారు, ఎన్నో పెళ్ళిళ్ళు చేసినట్లుగా.

పార్వతమ్మేమీ మాట్లాడలేదు.

కుసుమ భోంచేసి వెళ్ళిపోయింది.

"అదేమిటండీ! మీ భోజనం తరగటం లేదు? మగవాళ్ళు కాళ్ళు తడారేటప్పటికి భోంచేసి లేవాలంటారు" అంటూ ఆలోచనా సముద్రంలో మునిగిన భర్తను హెచ్చరించింది పార్వతమ్మ.

"ఆఁ, ఏదో ఆలోచిస్తోంటే ఆలస్యమయిందిలే. దానికేంగాని... మనమ్మాయికి మాత్రం పెళ్ళిచేసే వయసు రాలేదా? మనం ఎందుకు తొందరపడటం లేదూ?" అంటూ తర్కించారు జగన్నాథంగారు.

"అప్పుడే ఏం పెళ్ళండీ? ఇంకా ఇరవై ఏళ్ళన్నా నిండలేదు. అయినా చదువు పూర్తిగావద్దూ? నేనే మిమ్మల్ని పీడించవలసిందిపోయి మీరే నన్ను పీడిస్తున్నారే!" అంది ఆశ్చర్యంగా పార్వతమ్మ.

"పీడించడంగాదు. మనకేం తక్కువనీ, పెళ్ళి మాట తలపెట్టకపోవటానికి? అదీగాక ఈ ఆస్తంతా దానిదే. ఇంక చదువు విషయం అంటావా? ఆఁ, ఏదో హాబీగా చదువుతోందే గాని, తప్పనిసరిగా పరీక్ష పాసై ఉద్యోగం చెయ్యవల్సిన కర్మేముందీ దానికి? ఇంతకీ

నీ కెందుకు ఇష్టం లేదంటావు?"

"బాగుంది, నా ఇష్టాయిష్టాలకేముందీ? ఇరవై ఏళ్ళన్నా నిండకుండా పెళ్ళి చెయ్యటం నాకేమీ ఇష్టం లేదు, తర్వాత మీ ఇష్టం" అంటూ చిన్నబుచ్చుకున్న మొహంతో జవాబిచ్చింది పార్వతమ్మ.

"అది కాదు పార్వతీ! నేను చెప్పేది కూడా కొంచెం ఆలోచించు మరీ. మనకిక ఎవరున్నారు కనుక? ఎటొచ్చీ అదేగా? దాని ఆనందం కంటే మనకింకేం కావాలీ? పెళ్ళయిన తర్వాత దాని కడుపున నలుగురు పిల్లలు పుడితే వాళ్ళని చూస్తూ కాలం గడపవచ్చు" అంటూ భోజనం ముగించి సావిట్లో కెళ్ళిపోయారు జగన్నాథంగారు.

పార్వతమ్మ కేమీ పాలుపోలేదు, భర్త గారి ఆఖరి మాటలావిడకు స్పృహ తప్పేటంత పరిస్థితి వరకూ లాక్కొచ్చాయి.

"కుసుమకి పెళ్ళా? ఏడాది తిరగకుండా గర్భం! తనకి మనవలు. తను అమ్మమ్మ. తను అమ్మమ్మౌ తుందా? అప్పుడే తనమ్మమ్మయ్యేంత ముసలిదా? అలాంటి దెప్పటికీ జరక్కూడదు" అని గట్టిగా నిశ్చయం చేసుకొంది పార్వతమ్మ.

ప్రస్తుతం పార్వతమ్మ చాలా అందంగా వుంటుంది. మనిషికి నలభై ఏళ్ళు వచ్చినా ముప్పై ఏళ్ళలోపు మనిషిగా కన్పడుతుంది. కుసుమనీ పార్వ తమ్మనీ చూసిన వాళ్ళు తల్లీ కూతుళ్ళనుకోరు. అక్కా చెల్లెళ్ళనుకుంటారు. ఎప్పుడైనా పేరంటానికిగానీ, సిని మాకిగానీ వెళ్ళవలసి వస్తే వాళ్ళిద్దరూ ఒకర్ని మించి నట్లొకళ్ళు ముస్తాబులు చేసుకుంటారు. అలాంటి సమయాల్లో పార్వతమ్మని పోలిక పట్టలేరు. ఇటు వంటి నవయవ్వని పార్వతమ్మకు అమ్మమ్మగా మారటం ఏమిష్టముంటుంది చెప్పండి? పోనీ కూతు రికి పిల్లలే కలగరనుకుంటే అల్లుడొస్తే 'అత్తగారూ' అని—అయినా పిలుస్తాడుగా! కూతురికి పెళ్ళి చెయ్య మనకపోవడానికీ, భర్త చేస్తాననా, వాయిదాలు వేయ డానికి, ఇదే కారణం.— ఇలాగే ఏవేవో ఆలోచించుకు పోతోంది పార్వతమ్మ. భర్త భోంచేసిన కంచమన్నా తీయలేదు. "పార్వతీ" అన్న భర్త మాటలు పార్వ తమ్మను ఆలోచనా సాగరం నుంచి తిరిగి వంటగది లోకి తీసుకొచ్చాయి. "ఆఁ వస్తున్నానండీ" అంటూ పార్వతమ్మ త్వరగా సావిట్లో కెళ్ళింది.

"వంటింట్లోనే పాతుకు పోయావేం? ఇంకా వస్తావు, ఇంకా వస్తావు — అని కాచుక్కూచున్నాను, తమలపాకులు తీసుకురా" అన్నారు విసుగ్గా జగ న్నాథం గారు.

పార్వతమ్మ ఏమీ మాట్లాడలేదు. గబ గబా తమల పాకులు మడిచి అందిస్తూ "ఏమండీ, మీరేమీ అను కోకపోతే ఒక మాట చెప్తాను. కుసుమకి ఇప్పుడప్పుడే పెళ్ళివద్దు. అనవసరంగా దాని చదువు చెడుతుంది, అదే నా భయం. తర్వాత మీ ఇష్టం" ఎంతో లాలనగా కోరింది.

"అట్లాగే పార్వతీ! ఏదో మాటవరసకన్నానేగానీ, నీకిష్టం లేకుండా పెళ్ళి జరుగుతుందా? ఈ మాత్రం దానికింత బ్రతిమాలాలా? ఆఁ, ఆ గొడవకేంగాని, నా స్నేహితుడొక డొచ్చాడు. ఇవ్వాళ సినిమాకెడుతున్నాం. టైం కూడా అయింది" అంటూ కోటు తగిలించుకుని గుమ్మం దాటారు జగన్నాథం గారు.

భర్త కనుమరుగయ్యేదాకా చూసింది. తర్వాత వీధి తలుపు వేసుకొని వంట గదిలోకెళ్ళింది. తను అమ్మమ్మ కాబోవటం లేదు! ఆ సంతోషంలో పార్వ తమ్మకి ఆకలనిపించలేదు. క్రింద తలుపులన్నీ వేసేసి తిన్నగా పైకెళ్ళింది.

కుసుమ ఏదో బొమ్మవేస్తూ తలెత్తి చూసి, మళ్ళీ తన పనిలో నిమగ్నమయి పోయింది. పార్వతమ్మ కుసుమ ప్రక్కగా కుర్చీలో కూచుంది.

"కుసుమా!"

కుసుమ తలెత్తి చూసింది ప్రశ్నార్థకంగా.

"నిన్నొకటడుగుతాను గాని సిగ్గుపడకుండా చెప్పాలి. నీ కిప్పుడు పెళ్ళి చేసుకోవాలని వుందా?" — ఇదీ పార్వతమ్మ ప్రశ్న.

నిజమే. తనకి ప్రస్తుతం పెళ్ళి చేసుకోవాలని వుందా? కుసుమ, తనని తానే ప్రశ్నించుకొంది. "నిజంగా లేదమ్మా! నాకింకా చదవుకోవాలని వుంది, చదివిస్తారా?" అని తిరిగి ప్రశ్నించింది కుసుమ.

"ఓ! నీ ఇష్టం వచ్చినంత వరకూ చదువుకో" అమ్మమ్మనవటం తప్పిపోయింది గదా అన్న సంతో షంలో అభయమిచ్చేసింది పార్వతమ్మ. ఇద్దరికీ ఒక్క సారే చెప్పలేనంత ఆనందం కల్గింది. వారి ఆనందా

లకు కారణాలు వేరు వేరు.

జగన్నాథంగారు ప్లీడరు. వారికి చాలా ఆస్తుంది. ప్రస్తుతం వారు నివసించే పట్టణానికి సమీప గ్రామం లోనే సుమారు 20 ఎకరాల వరి పండే భూమి, సుమారు ఏడెకరాలలో రకరకాల పళ్ళతోటలు, పట్నంలో నివసించటానికి చక్కని మేడ, గుర్రబ్బండీ, కావాలసినన్ని హంగులూ వున్నాయి. కేసులు చాలా వస్తాయి కాని దేహానికి కావలసిన విశ్రాంతి వుంచు కొన్న తర్వాతనే కష్టపడతారు. అయినా వారికి రాబడికి లోటు లేదు. దీనికి తోడు ఒక్కగానొక్క కూతురు. అందగత్తె. తర్వాత ఇద్దరు ముగ్గురు పుట్టినాగాని బ్రతక లేదు. కుమారుల్లేరన్న కోరిక, ఆ దంపతులను బాధి స్తుందనక్కర్లేదు.

ప్రస్తుతం కుసుమకు ఇరవై ఒకటో సంవత్సరం జరుగుతూంది. బి.ఏ. పాసైంది. ఇంకా పెళ్ళి చెయ్య లేదు. ఐనా పార్వతమ్మ సంఘానికి భయపడలేదు.

"ఫ్లారెన్స్ నైటింగేల్ చూశారూ? ఇవ్వాళే ఆ పుస్తకం చదివాను. చక్కగా ఆ అమ్మాయి పెళ్ళి చేసుకోకుండా దేశానికి సేవచేసింది. కనుకనే తరతరాలుగా ఖ్యాతిని సంపా దించుకోగల్గింది" అంది పార్వతమ్మ భర్తతో ఒకనాడు.

"అయితే నీవు కూడా పెళ్ళి చేసుకోకుండా, అట్లా సేవ చేయలేక పొయ్యావా!" అన్నారు నవ్వుతూ జగ న్నాథం గారు.

ఇంతలో కుసుమ మేడపైనుంచి వచ్చింది, "నాన్నగారూ! సినిమా కెడుతున్నా. అమల కూడా వస్తానంది."

"అట్లాగేనమ్మా. ఎంత కావాలంటావ్?"

"మూడు రూపాయలు చాలు."

"చిల్లరలేదు, ఈ నోటు తీసుకెళ్ళు. వచ్చేటప్పుడు జాగ్రత్తగా రండి" అంటూ మనీపర్సు తీసి ఐదు రూపా యల నోటు అందించారు జగన్నాథంగారు. దాన్ని తీసుకుని వెళ్ళిపోయింది కుసుమ.

"పార్వతీ! అమ్మాయిని చూశావా? చిలకలా వుంది! పెళ్ళయితే అమ్మాయి కళ్ళెదురుగా లేకుండా పోతుందనా నీ భయం? అట్లాగయితే ఇల్లరికపు టల్లుణ్ణే తెస్తాను. ఎన్నాళ్ళనీ ఇట్లా? పార్వతీ! నువ్వు చెప్పినట్టే చదువుకి ఆటంకం అవుతుందని ఇంత వరకూ వూరుకున్నానా? ఆ చదువు కూడా అయి పోయింది. అసలు నీ మనసులో వున్న సంగతి ఏమిటో చెప్పకూడదూ?" చిరుకోపంగా అడిగారు జగ న్నాథం గారు.

పార్వతమ్మ తనకిక ఓటమి తప్పదనుకుంది. ఎన్నాళ్ళని చదువు వంక పెడుతుంది? పోనీ అమ్మా యిని డాక్టర్ కోర్సుకి పంపించి పెళ్ళి చెయ్యొద్దని చెపుదామా? అమ్మో! అట్లా చెప్పటమే? అయితే పెళ్ళి కొప్పుకోవాలా? మొన్ననే మురళి ఉత్తరం వ్రాసింది. ఆడపిల్లట. కుసుమకు మాత్రం కలగకుండా వుంటారా? పోనీ ఈ ఏడాదికైనా ఆపేస్తే బావుణ్ణు.

"ఏం పార్వతీ! పెళ్ళంటే నీవింత బెంగపడతా వెందుకూ! నీ తత్వం నాకేమీ బోధపడటం లేదు. కుసుమ నడిగి, ఈ ఏడాదే ఆ కాస్త పనీ అయిందని పించేస్తాను" అన్నారు జగన్నాథంగారు కోపంగా. పార్వ తమ్మ మాట్లాడలేకపోయింది.

★ ★ ★

పార్వతమ్మ కేమీ తోచటం లేదు. ఏం చేస్తున్నా కుసుమ విగ్రహమే కన్పడుతూంది. అమ్మాయి ఇంట్లో కళ్ళకెదురుగా కన్పడుతూంటే భర్త పోరు మరీ ఎక్కు వౌతూంది. కుసుమ కొన్నాళ్ళపాటు ఎటన్నా వెడితే కొంచెం ఆయన మనస్సు శాంతిస్తుంది. మొన్ననే, బెజ వాడ నుంచి సత్యవతి వదిన కూడా ఉత్తరం వ్రాసిం దిగా, కుసుమని పంపమని. ఆ ఊళ్ళోనే దాని స్నేహితురాలు మురళి కూడా వుంది. ఇంత మంచి ఆలోచన తట్టినందుకు తబ్బిబ్బు అయిపోయింది పార్వతమ్మ. కుసుమ దగ్గర కెళ్ళింది.

"అమ్మా కుసుమా! మొన్న సత్యవతి అత్తయ్య రాసిన ఉత్తరం చూశావుగా? మరి ఎప్పుడెళతావూ?" అంటూ ప్రశ్నించింది.

"మురళి కూడా వ్రాసిందమ్మా రమ్మని. ఓ పదిహేను రోజులుండి వస్తా" అంటూ సంతోషంతో పెట్టే, బెడ్డింగూ సర్దుకోసాగింది. పార్వతమ్మ తల్చు కోవటం, చెయ్యలేక పోవటమూనా? ఆ సాయంత్రమే కుసుమని బెజవాడ పంపివేసింది.

"రవి కన్పట్టం లేదేం మురళీ!" అని స్నేహితు రాల్ని అడిగింది కుసుమ.

"ఓహో! ఇప్పటికి జ్ఞాపక మొచ్చాడన్న మాట! అవున్లే, మీకెట్లా జ్ఞాపకముంటాం? అయినా నీకు రవితో ఏం పనీ?" కుసుమ నేడిపించటానికి అడిగింది మురళి.

నిజంగా కుసుమకి సిగ్గువేసింది! "పోదూ, తన పేరెత్తాననేగా నీవిట్లా మాట్లాడుతున్నది? సరేలే, నీతో ఇక మీద మాట్లాడితే అడుగు" అంటూ పక్కకి తిరిగి కూర్చుంది కుసుమ. రెండో వాళ్ళని ఎట్లా వోడించాలా అని ఇద్దరూ ప్రయత్నం చేస్తున్నారు.

"అమ్మా, మురళీ!" అన్న కేక విన్పించింది ఇద్ద రికీ. ఇద్దరూ ఆశ్చర్యపోయారు. అది జగన్నాథంగారి గొంతు.

"అరే! మీ నాన్నగారొచ్చారే! పద వెడదాం" అంటూ వాళ్ళిద్దరూ క్రింది కొచ్చారు. క్రింది సావిట్లో మురళి తల్లి అన్న పూర్ణమ్మగారు జగన్నాథం గారితో మాట్లాడుతున్నారు.

"ఏం నాన్నా, మీ రొచ్చారేం? అమ్మకెలా వుంది?" అంటూ ఆత్రంగా ప్రశ్నించింది కుసుమ.

"మీ అమ్మకి బాగానే వుందమ్మా! రవేడీ? అతనితో కొంత పనుండి వచ్చాను" అన్నారు.

"రవీ, మా అల్లుడూ కలిసి ఏదో పని మీద గుంటూరెళ్ళారు. ఇవ్వాళ రావాలి బహుశా. వాళ్ళే వస్తారుగానీ భోజనానికి లేవండి మీరు" అంటూ తొందరపెట్టింది అన్నపూర్ణమ్మ.

అందరూ వంటింట్లోకి దారితీశారు.

"ఆ వచ్చిన పనేదో ఇప్పుడు చెప్పండి మామయ్యా!" అంటూ కదిపింది మురళి.

"నువ్వు నన్ను మావయ్యా అని యధాలాపంగా అన్నావేమోగాని ఆ మాటనే నిజం చేసుకోవాలని వచ్చా. కుసుమకు పెళ్ళి చెయ్యటం అంటే మా పార్వ తికి సుతరామూ ఇష్టం లేదు. నిన్న నిక్కచ్చిగా అడిగితే తనకి ఇష్టంలేదనీ, పూర్తిగా పెళ్ళి మానేయమనీ చెప్పింది. నా కొళ్ళు మండిపోయింది. ఇక మీదట పార్వతి మాటలు వినదల్చుకోలేదు. అందుకని కుసు మకి మీ ఊళ్ళోనే రిజిస్టర్ మేరేజ్ చేసి ఇంటికి తీసికెడదామని వచ్చా. బావుందా నా ఐడియా?" అంటూ పరిస్థితులన్నీ తెలియజెప్పారు జగన్నాథం గారు.

"మీ ఐడియాకేం? దివ్యంగా వుంది. కానీ, కుసు మని నాకిచ్చి పెళ్ళిచేస్తారేమిటి, కొంపతీసి? పెళ్ళికొడు కుని వెదికారా?" అంది కొంటెగా మురళి.

"ఓ! పెళ్ళి కొడుకులకేం లోటమ్మా? మన రవి కుమార్ లేడూ?" అన్నారు జగన్నాథం గారు, అన్న పూర్ణమ్మ గారిని పరీక్షిస్తూ.

ఎవరు మాత్రం ఈ సంబంధానికి వప్పుకోరూ? చిలకలాంటి పిల్ల — సుమారు లక్ష రూపాయలు చేసే ఆస్థి.

"ఏమండీ! వదినగారూ! వింటున్నారా, సంభా షణ?" అంటూ కుసుమని గిల్లింది మురళి.

కుసుమా, మురళీ భోంచేసి వెళ్ళిపోయారు. తర్వాత జగన్నాథం గారూ, అన్న పూర్ణమ్మగారూ ఏవేవో మాట్లాడుకున్నారు. ఆ సాయంత్రానికి మురళి తండ్రికీ, రవికీ, అందరికీ తెలిసిపోయింది సంగతి. అందరూ అంగీకరించారు. రెండు రోజుల తర్వాత రిజి స్టర్ మేరేజి వైభవంగా జరిగిపోయింది. ఆ సాయంత్రం జగన్నాథంగారు కూతుర్నీ — అల్లుణ్ణీ తీసుకొని ఇంటికి బయలుదేరారు.

★ ★ ★

పెళ్ళినుంచి తప్పించాలి గదా అని పొరుగూరు పంపితే, పెళ్ళి చేసుకొని తయారయింది కుసుమ. రవి డాక్టరు పరీక్ష పాసై ప్రాక్టీసు చేస్తున్నాడు.

"ఏమిటి కుసుమా నీ మెళ్ళో? మంగళ సూత్రం లాగుందే!" అంది పార్వతమ్మ ఆశ్చర్యంగా, అప్పుడే బండిదిగి వస్తూన్న కూతురుతో.

కుసుమ మాట్లాడలేదు.

"దాన్నేమీ అనకు పార్వతీ! నేనే ఈ పనంతా చేయించాను. నువ్వెట్లాగూ వప్పు కోవుగదా అని ఈ పని చేయించవలసి వచ్చింది. నీ మూలంగా ఎంత భాగ్యమున్నా అమ్మాయికి చక్కగా పెళ్ళి చెయ్యలేక పోయాం. అయినా చక్కని అల్లుడు దొరికినందుకు సంతోషించాలి" అంటూ జరిగిన సంగతి నివేదించారు

జగన్నాథం గారు.

పార్వతమ్మకు కళ్ళు చీకట్లు కమ్మాయి. కాళ్ళకింద భూమి కుంచించుకు పోతున్నట్లయింది.

"నీకు తల్లి కూడా జ్ఞాపకం రాలేదా కుసుమా?" అంది కన్నీళ్ళెట్టుకుంటూ.

"అమ్మా! నన్ను క్షమించమ్మా" అంటూ ఏడ్చింది కుసుమ.

గుండెను రాయి చేసుకుంది పార్వతమ్మ.

★ ★ ★

'అమ్మమ్మా! చూడవే. గోపిగాడు నా తొక్కా ఎలా తింపాడో" అంటూ చిరిగిన చొక్కాను పట్టుకొని రాము పార్వతమ్మ దగ్గిర కొచ్చాడు.

"అయ్యయ్యో! ఎందుకు చింపాడమ్మా ఇట్లా సిల్కు చొక్కానీ?" అంటూ మనవణ్ణెత్తుకుంది పార్వతమ్మ.

"అది కాదే. బిసకత్తెట్టమన్నాడు. పెత్తాను. అది తీనేసి, మల్లీ పెత్తమన్నాడు, లేదన్నాను. అందుకని తొక్కా పత్తుకుని లాగాడే, తినిగిపోయింది" అంటూ తన బుల్లి బుల్లి కబుర్లతో జరిగిందంతా చెప్పాడు రాము.

"మరి వుంచుకునే ఎందుకు లేవన్నావూ? పెట్టలేకపోయావా? అబద్ధాలాడొచ్చా" అంది మందలింపుగా పార్వతమ్మ.

"అయితే, ఇప్పుడెల్లిరానా?" అంటూ పార్వతమ్మ కళ్ళల్లోకి చూశాడు రాము.

"సాయంత్రం వెడుదువుగానిలే, అమ్మ దగ్గర కెళ్ళి చొక్కా ఇంకోటి తొడిగించుకురా బాబూ!" అంటూ రామూని దింపింది పార్వతమ్మ.

రామూ బుల్లి బుల్లి అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

పార్వతమ్మ తనలో తానే నవ్వుకొంది. అప్పటికీ ఇప్పటికీ తానెంతగా మారిపోయింది! రాము సూర్య కిరణంలా వుంటాడు. పచ్చని శరీరచ్ఛాయ, నల్లని వంకీలు తిరిగి బుల్లిజుత్తు.

ఒకప్పుడు మనుమలు కల్గుతారని కంపించి పోయిన పార్వతమ్మ కిప్పుడు ఆ మనవడే సర్వస్వం అయిపోయాడు.

[1955 ఏప్రిల్ 'తెలుగు స్వతంత్ర' మాసపత్రికలో]★

**ఈ కథ గురించి:**

ఇది, దాదాపు 50 ఏళ్ళ కిందట రాసిన కథ. దీన్ని ఈ కథల సంపుటంలో చేర్చింది — ఈ కథ గొప్పగా వుందని కాదు, గొప్పగా లేదని చెప్పాలనే!

ఆ రోజుల్లో, మా ఊళ్ళో ఒకావిడ గురించి ఈ కథలోలాగే చెప్పుకునే వారు. టీచరుగా పనిచేస్తున్న కూతురికి పెళ్ళి చెయ్యడం ఆవిడకు ఇష్టంలేదని అనుకునే వారు. కథలో ఇక మిగిలినదంతా నా పైత్యం. ఆ పంతులమ్మ తల్లికి, అమ్మమ్మ అవడం ఇష్టం లేకనే కూతురు పెళ్ళి గురించి ఆలస్యం చేస్తోందని నేను ఊహించానో, అది కూడా అందరూ చెప్పుకున్నారో ఇప్పుడు గుర్తులేదు. అసలు ఇక్కడ చెప్పదల్చుకున్న విషయం అది కాదు.

ఈ కథకి కొంచెం ఆధారంగా ఎవర్ని తీసుకున్నానో వాళ్ళు ఆస్తీపాస్తీలేని సామాన్య కుటుంబీకులు. ఈ కథ రాసిన నేనూ అలాంటి కుటుంబం మనిషినే. కానీ, ఈ కథనిండా బోలెడు ఆస్తి! అదే ఆశ్చర్యం! నా మనసునిండా, అంత చిన్న వయసులో, అంత ఆస్తి ఊహలు వున్నాయన్నమాట!

'జగన్నాథం గారు ప్లీడరు. వారికి చాలా ఆస్తుంది. వారు పట్టణంలో ఉంటారు, చక్కని మేడా, గుర్రబ్బండీ, బోలెడు హంగులూ వున్నాయి. దగ్గిర గ్రామంలో 20 ఎకరాల వరిపండే భూమీ, ఏడెనిమిదెకరాల పళ్ళ తోటలూ వున్నాయి. రాబడికి లోటు లేదు — చూడండి ఎంత ఆస్తో! పైగా వారికి ఒక్కతే కూతురు! అందగత్తె! తర్వాత పుట్టిన పిల్లలు బతకలేదు. అందరూ పోయి ఒక్క పిల్లే మిగిలింది.

ఏమిటీ ఈ ఆలోచనలు? అప్పుడు మా ఇంట్లో 7గురు పిల్లలు! ఇల్లు — తాటాకుల పాక! తిండికీ

బట్టకీ మాత్రం గడిచే చిన్న భూమి! — మరి, మొట్టమొదట రాసిన కథలోకి 30 ఎకరాల భూమీ, పెద్ద మేడా, గుర్రబ్బండీ, ఒక్క కూతురూ (పైగా, అందగత్తె) — ఇవన్నీ ఎలా ఊహించాను?

ఇప్పుడు ఆలోచిస్తే ఏం కనపడుతోందంటే — ఈ సంఘంలో పుట్టి పెరిగే ప్రతి ఒక్కరి ఆలోచనలూ ఇలాగే వుంటాయి. ఆస్తికోసం వెర్రి ఆశలు!

అప్పుడు సినిమాలు బాగా చూసేవాళ్ళం. సినిమాల్లో ఏం వుంది? కార్లూ మేడలూ నగలూ అలంకరణలూ ఆస్తులూ, ఒక్కొక్క కూతుళ్ళూ! అప్పుడు, ఈ సినిమాలు తప్ప ఇతర సాహిత్యాలు అంతగా తెలీవు. కొన్ని మంచి పుస్తకాలే చదివినా, వాటిని గ్రహించేంత వయసూ తెలివీ లేవు. అంటే, ఆ సినిమాల భిక్షే అన్నమాట ఇది! ఇదంతా తప్పు అని ఎవరైనా చెప్పారా? ఎవ్వరూ చెప్పలేదు. తల్లిదండ్రులూ మేష్టర్లూ, ఎవ్వరూ 'ఆస్తి' గురించి ఏమీ నేర్పలేదు. వాళ్ళకీ ఏమీ తెలీదు. వాళ్ళ ఆలోచనలూ నా ఆలోచనల్లాగ వుండవలసిందే!

'ఆస్తి' అంటే ఏమిటో తెలుసుకున్న తర్వాతే కదా, మొదట్లో రాసిందంతా ఆశ్చర్యం కలిగిస్తోంది!

ప్లీడరు గారికి, దాదాపు 30 ఎకరాల భూమి ద్వారా డబ్బు వచ్చి పడుతోంది. ఆ భూమిని పండించడంలో, ఆ కుటుంబం, ఏదైనా పని చేస్తోందా? ఆ పనులన్నీ కౌలు రైతు కుటుంబాల వాళ్ళు చేస్తున్నారు! ప్లీడరు గారి 'చక్కని మేడ'ని కట్టేపని కట్టడం పని కార్మికులు చేశారు. దాన్ని రోజూ శుభ్రం చేస్తూ నివాసయోగ్యంగా వుంచే పనులన్నీ ఇంటి పని మనుషులు చేస్తారు. బైట భూముల్లోనూ, ఇంటిలోనూ ఎందరో పేదలు చాకిరీలు చేస్తూ వుంటే, ప్లీడరు గారి కుటుంబానికి ఆస్తులూ సుఖాలూ!

ఆస్తి అనేది చౌర్యమే.

ఈ సంగతి చిన్నప్పుడే తెలిసి వుంటే, ఈ కథలో వర్ణనలు అలా చేస్తానా? ఆస్తి మీద అంత గౌరవం చూపిస్తానా? — అలా చెయ్యను.

జ్ఞానం అంటే వేరే ఏమీ కాదు. సంఘంలో ఏం జరుగుతోందో అది తెలుసుకుంటే, అదే — జ్ఞానం. అది తెలియకుండా చేసే ఆలోచనలన్నీ అజ్ఞానం.

మనుషులు శ్రమ చెయ్యడమూ, మనుషుల మధ్య శ్రమ సంబంధాలూ, శ్రమదోపిడీ, కలిమిలేములూ, సిరిసంపదలూ — ఇవన్నీ ఆస్తికి వేరువేరు కోణాలు.

'ఆస్తి' గురించీ, 'కలిమిలేముల' గురించీ మార్క్సిజం చెప్పిన నిజాలు తెలియని కాలంలో బతికిన మనుషులు, మానవ జీవితం గురించి ఏమాత్రమూ తెలియకుండానే బతికి వెళ్ళిపోయారు!

ఈనాడు కూడా ఈ విషయాలు తెలుసుకోకపోతే, ఈ మనుషులు కూడా జంతువులతో సమానమే.

వెనకటి కాలంనించీ మనం మాట్లాడేదీ, రాసేదీ, చేసేదీ, ఆలోచించేదీ, ఇష్టపడేదీ, అయిష్టపడేదీ — వీటిలో అనేక విషయాలు తప్పులే. కానీ అవన్నీ తప్పులని కూడా తెలియకుండానే జీవితాలు గడిచిపోతున్నాయి.

ఇప్పటికీ మార్క్సిజం తెలియకపోతే ఈ కథలో నేనేం తప్పుచేశానో, చిన్న వయసులో ఆస్తిమీద ఎంత ఆశతోటీ గౌరవంతోటీ వున్నానో తెలిసేది కాదు.

ఈ కథలో, ఆ కుటుంబానికి అంత ఆస్తి లేకపోయినా ఆ కథ అలాగే ఉండవచ్చు. కానీ, ఎకరాలూ మేడలూ గుర్రబ్బళ్ళూ లేకపోతే ఆ కథ ఆనాడు నాకే నచ్చదు.

7-6-2004